RNI: TELTEL12215

https://youtube.com/@UstudioTV

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com








RANGAREDDY, EDITION : 01, VOLUME :164 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 29 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 164 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 29 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### ఐరాసలో భారత్

## ఓటింగ్‌కి దూరం

- ప్రియాంక దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పాలస్తీనా– ఇజ్రాయెల్ వివాదంలో మానవతా సంధికి ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. 'పౌరుల రక్షణ, చట్ట పరమైన, మానవతా బాధ్యతలను సమర్థించడం' అనే పేరుతో జోర్డాన్ రూపొందించిన తీర్మానంపై ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ఓటింగ్‌కి భారత్ దూరంగా ఉంది. జోర్డాన్ తీర్మానానికి భారత్ దూరం కావడం పట్ల కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'గాజాలో కాల్పుల విరమణ కోసం మన దేశం ఓటింగ్‌కి దూరంగా ఉన్నందుకు నేను


మిగతా 2లో

# రైతు బంధుపైనే.. గులాబీ ఆశలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లకు రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు సాయాన్ని అందిస్తున్నది. జూన్‌లో ఒకసారి, డిసెంబరులో మరోసారి రైతుల ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నది. కానీ ఈసారి నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండడంతో డిసెంబర్ వరకు ఆగకుండా నవంబరులోనే ప్రక్రియను పూర్తి చేయాలనుకుంటున్నది. ఎన్నికల కారణంగా స్టేట్‌లో ఎలక్షన్ కోడ్ అమలవుతున్నందున ఈ స్కీమ్‌ను అమలు చేయాలంటే విధిగా కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలనుకుంటున్నది. అయితే ఈసీ నుంచి అనుమతి వస్తుందా? రాదా? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. అన్ని స్కీముల అమలును అటకెక్కించిన రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు సాయం కోసం నిధులను సమకూర్చుకున్నది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే రైతుబంధు సాయాన్ని ఒక నెల రోజులు అడ్వాన్స్ చేసి ఎన్నికలకు ముందే రైతులకు అందించాలనుకుంటున్నది. ప్రతి సంవత్సరం డిసెంబర్ చివరి వారంలో ఫండ్స్ రిలీజ్ చేయడం ఆనవాయితీ. కానీ ఈ సారి మాత్రం ఓట్ల పండుగ కావడంతో ప్రయోజనం పొందేందుకు ఈ



మిగతా 2లో

### 111 పతకాలతో

# 5వ స్థానంలో భారత్

## ముగిసిన ఆసియా పారా క్రీడలు

హాంగ్జౌ--పభాత సూర్యుడు

4వ ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు అత్యుత్తమ ప్రదర్శనను కనబరి చారు. చైనాలోని హాంగ్జౌలో శనివారంతో ముగిసిన ఆసియా పారా క్రీడల్లో భారత్ ఈసారి రికార్డుస్థాయిలో 111పతకాలు చేజి క్కించు కొని సత్తాచాటింది. ఈ క్రీడల చరిత్రలో భారత్‌కు ఇన్ని పతకాలు దక్కడం ఇదే తొలిసారి. ఇందులో 29స్వర్ణ, 31రజత, పతకాలతో పాటు మరో 51 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక చివరిరోజు భారత్‌కు 12పతకాలు దక్కాయి. ఇందులో

మిగతా 2లో




### ముదిరాజ్ వర్గాలే టార్గెట్‌గా

## బీఆర్ఎస్ వ్యూహం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు కీలకం. ఈ విషయంలో బీఆర్ఎస్ లెక్క తప్పినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణలో బలమైన బీసీ వర్గంగా ఉన్న ముదిరాజ్ వర్గానికి ఒక్క టిక్కెట్ కూడా కేటాయించకపోవడంతో ఆ వర్గం మొత్తం ఏకం అయింది. దీంతో ముదిరాజ్‌లను సంతృప్తి పరిచేందుకు బీఆర్ఎస్ ఆ వర్గానికి చెందిన ప్రముఖులకు తిరస్కరించలేని ఆఫర్లు ఇస్తూ పార్టీలోకి తీసుకుంటోంది. కానీ ఎంత మందిని పార్టీలో చేర్చుకున్నా టిక్కెట్ ఇవ్వకపోవడం అనేది ఆ వర్గాన్ని అసంతృప్తికి గురి చేసిందన్న అభిప్రాయం మాత్రం గట్టిగా వినిపిస్తోంది. తెలంగాణ బీసీ వర్గాల్లో ముదిరాజుల వర్గం ప్రభావవంతమనది. బీసీ వర్గాల్లో ముదిరాజుల ఓట్లు కనీసం యాభై లక్షలు ఉంటాయని అంచనా. అంటే

మిగతా 2లో

# ఆరుగురు అభ్యర్థుల ఖరారు

- సోనీయా ఆశీస్సులతో మాజీ మంత్రి చిన్నారెడ్డికి అవకాశం
- శ్రీహరికి అండగా నిలిచిన ఏఐసిసి అధ్యక్షులు ఖర్గే
- మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మేఘ రెడ్డి కి మొండి చెయ్యి
- రాజకీయాలలోకి చిటెం కుటుంబం నుంచి మరో వారసురాలు

మహబూబ్ నగర్- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉమ్మడి పాలమూరు జిల్లాలో మిగిలిపోయిన ఆరు స్థానాలకు అభ్యర్థులను శుక్రవారం ప్రకటించింది. మాజీ మంత్రి చిన్నారెడ్డికిచిటేం కుటుంబానికి చెందిన డాక్టరు పర్ణిక రెడ్డి కి జాబితాలో చోటు దక్కడం విశేషం కాగా, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, పెద్ద మందడి ఎంపిపి మెఘారెడ్డి కి అవకాశం దక్కక పోవడం తో వారి అనుచరగణం నిరాశకు గురయ్యారు. మొత్తం ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రకటించడం తో , అధికార పార్టీ కి ధీటుగా ఎన్నికల ప్రచారానికి పార్టీ నాయకులు, శ్రేణులు సన్నద్ధం అవుతున్నారు. మొదటి విడత 8 నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులు ప్రకటించిన హస్తం పార్టీ, రెండవ జాబితాలో లిస్టులో మిగిలిపోయిన ఆరు స్థానాలు అభ్యర్థుల ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది.

రెండవ జాబితాలో మక్తల్ అసెంబ్లీ నియోకవర్గం నుంచి ఒకే ఒక్క బీసీ అభ్యర్థి వాకిటి శ్రీహరికి పోటీ చేసే అవకాశం లభించింది. పలు సమీకరణాల కారణంగా పలువురి పేర్లు తెరమీదికి వచ్చాయి. గత మూడు దశాబ్దాలుగా పార్టీ నమ్ముకొని పనిచేస్తున్న శ్రీహరి చివరికి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఆశీస్సులతో అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. వనపర్తి నుండి పోటీ చేసే అవకాశం పెద్ద ముందటి ఎంపీపీ మేఘ రెడ్డికి దక్కుతుందని అందరూ ఊహించారు. చివరకు కాంగ్రెస్

మిగతా 2లో

## బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ



అదిలాబాద్- ప్రభాత సూర్యుడు

ఇప్పుడు ఆ రెండు పార్టీలు అపరేషన్ కమలంపై వర్కవుట్ చేస్తున్నాయట. ఇన్ని రోజులు కేడర్‌ను నమ్ముకున్న పార్టీలు, ఇప్పుడు మాత్రం మెజారిటీ, మైనారిటీ అంటూ వివిధ వర్గాలను నమ్ముకున్నాయట. నిజామాబాద్ జిల్లాలో ఆ నియోజకవర్గం ఇప్పుడు కమలం బలంగా ఉండటం, దానికి తోడు మైనారిటీ ఓటర్లు అధిక సంఖ్యలో ఉండటంతో రెండు పార్టీలు కలిపి కమలాన్ని టార్గెట్‌గా చేస్తున్నాయట. మైనారిటీ ఓట్ల పోలరైజేషన్ కోసం రెండు పార్టీలు సిగ పట్లు పట్టుకుంటుంటే కమలం పార్టీ మాత్రం మెజారటీ ఓట్లపై ఉన్న భరోసాతో ముందుకు వెళుతుందట. నిజామబాద్ జిల్లా బోధన్‌లో బీఆర్ఎస్, బీజేపీలు మైనారిటీ ఓట్ల కోసం సిగపట్లు పట్టుకుంటున్నాయట. బోధన్‌లో ప్రతిసారి ప్రత్యేక పరిస్థితులు ఉంటాయి. ఇక్కడి డిసైడింగ్ ఫ్యాక్టర్ ఎప్పటికీ మైనారిటీలే.. దీంతో అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు ఇక్కడి మైనారిటీ ఓట్ల

మిగతా 2లో

## ఐరాసలో భారత్ ఓటింగ్‌కి దూరం

(మొదటిపేజీ తరువాయి)
ఆశ్చర్యపోయాను. భారత్ ఓటు వేయనందుకు సిగ్గుపడుతున్నాను. మన దేశం అహింస, సత్యం సూత్రాలపై స్థాపించబడింది. ఈ సూత్రాలపై నిలబడే మన స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ఈ సూత్రాలే మన జాతీయతను నిర్వచించే రాజ్యాంగానికి ఆధారం. ఓరకంగా అంతర్జాతీయ సమాజంలో సభ్యునిగా దాని చర్యలకు మార్గనిర్దేశం చేసిన భారతదేశం యొక్క నైతిక ధైర్యానికి వారు ప్రాతినిధ్యం వహిస్తారు. అలాంటిది.. గాజాలో ఆహారం, నీరు, వైద్య సామాగ్రి, కమ్యూనికేషన్, విద్యుత్తు లేక లక్షలాది ప్రజలు అల్లాడిపోతున్నారు. మహిళలు, పిల్లలు హత్యకు గురవుతున్నారు. మానవీయ కోణంలో ఆలోచించి ఒక దేశానికి అండగా నిలబడాల్సిన మన దేశం, మానవత్వంలోని ప్రతి చట్టాన్ని తుడిచిపెట్టే సమయంలో ఒక స్టాండ్ తీసుకోవడానికి నిరాకరించడం విరుద్ధం.' అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. జోర్డాన్ తీర్మానానికి అనుకూలంగా 121 దేశాలు ఓటు వేయగా.. 44 దేశాలు ఓటింగ్‌కి గైర్హాజరయ్యాయి. 14 దేశాలు ఓటింగ్‌ని వ్యతిరేకించాయి.

## బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)
కోసం చేమటోడ్చుతున్నారట. దాదాపు 50 వేల మైనారిటీ ఓట్లు బోధన్ పట్టణంలోనే ఉండటంతో.. ఇప్పుడు ఆ ఓట్లే గెలపోటముల్లో కీలకం. ఇందు కోసం రెండు పార్టీలు పలు రకాల స్కెచ్‌లు వేస్తున్నారట. కానీ బీజేపీ మాత్రం మెజారిటీ ఓట్ల పోలరైజేషన్ పైనే డిపెండ్ అయింది. దానికి అనుగుణంగా వ్యూహాలు రచిస్తుందట కమల దళం.బోధన్ నియోజకవర్గం కొత్తగా నమోదైన మైనారిటీ ఓటర్లపై బీజేపీ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తుంది. మహారాష్ట్రలోని ధర్మాబాద్, బిలోలి ప్రాంతాలకు చెందిన మైనారిటీ వర్గాల వారిని బోధన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు అక్రమంగా ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు బీజేపీ నేతలు. దొంగ ఓట్లను తొలగించాలంటూ ఆందోళన బాట పట్టింది బీజేపీ. ఏకంగా నియోజకవర్గ ఇంచార్జ్ మెడపాటి ప్రకాశ్ రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో దాదాపు 8 వేలా ఓట్లను తొలగించడం ఇప్పుడు సంచలనంగా మారింది.బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు వేసిన స్కెచ్‌తో బీజేపీ మెజారిటీగా హిందూ ఓటు బ్యాంక్ పోలరైజెషన్ స్టార్ట్ చేసింది. ఇప్పుడు 8 వేల ఓట్లు పోవడంతో డైలామాలో పడిందట బీఆర్ఎస్. ఇక హిందూ ఓటు బ్యాంక్‌ను చేసుకునే పనిలో పడ్డాయి కాంగ్రెస్ బీఆర్ఎస్. ఈనేపథ్యంలోనే ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టాయి. బీజేపీతో ఇప్పటి వరకు ఉన్న వాళ్లను టార్గెట్ చేసి తమ పార్టీల్లోకి ఆకర్షిస్తున్నారట. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్, బీఆర్ఎస్‌గా ఫైట్ మారడంతో ఏవరి బలం వాళ్లు చూపించుకోవాడానికి ప్రయత్నాలు చేస్తున్నారట.బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ప్రకాశ్ రెడ్డి టికెట్ వస్తే ఇబ్బంది అవుతుందనే ఆలోచనతో మరో వ్యక్తికి టికెట్ వస్తుందనే మైండ్ గేమ్ అడుతున్నాయని ఆరోపిస్తున్నారు బీజేపీ నేతలు. ప్రస్తుతం పోటీ బీఆర్ఎస్, బీజేపీ మద్యే ఉండటంతో.. కాంగ్రెస్ బ్యాక్ ఎండ్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపిస్తున్నార? బీజేపీ నేతలు.ఇక ఇన్ని రోజులు క్యాడర్‌ను నమ్ముకున్న పార్టీలు ఇప్పుడు వర్గాలను నమ్ముకోవడం ఎలక్షన్ హీట్ కనిపించేలా చేస్తుందట. ఇప్పటికే ఎన్నికల వేడి స్టార్ట్ అయిపోవడంతో బీజేపీ అభ్యర్థి ఫైనల్ అయితే పోటి ఇంకా రసవత్తరంగా ఉండనుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. వర్గాలు, కులాలు అంటూ బోధన్ పాలిటిక్స్ ఇంకా ఎన్ని మలుపు తిరుగుతుందో వేచి చూడాలి..!

## 111 పతకాలతో 5వ స్థానంలో భారత్

(మొదటిపేజీ తరువాయి)
మహిళల పారా చెస్‌లో సంకృతి, హిమాన్షు, వృద్ధి కాంస్య పతకాన్ని సాధిం చారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో సౌందర్య ప్రధాన్ రజతంతోపాటు పురుషుల టీమ్ బి-1 కేటగిరీలో అశ్విన్, దర్పన్, సౌందర్య స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నారు. ఇక పురుషుల పారా జావెలిన్‌లో నీరజ్ యాదవ్(స్వర్ణం), టెక్‌చంద్(కాంస్యం) సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ స్కల్స్ పిఆర్-3లో నారాయణ, అనిత రజతం పతకంతో మెరిసారు. 2018 జకార్తా వేదికగా జరిగిన ఆసియా పారా క్రీడల్లో భారత్‌కు 72పతకాలు మాత్రమే దక్కగా ఈసారి మరో 39పతకాలు అధికంగా వచ్చాయి. అథ్లెటిక్స్ విభాగంలోనే ఈసారి ఏకంగా 55పతకాలు దక్కడం మరో విశేషం. ఈ సందర్భంగా భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దీపా మాలిక్ మాట్లాడుతూ.. భారత్‌కు అత్యధిక పతకాలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పతకాల పట్టిక

| వ.స | దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1. | చైనా | 214 | 167 | 140 | 521 |
| 2. | ఇరాన్ | 44 | 46 | 41 | 131 |
| 3. | జపాన్ | 42 | 49 | 59 | 150 |
| 4. | ద.కొరియా | 30 | 33 | 40 | 103 |
| 6. | ఇండియా | 29 | 31 | 51 | 111 |
| 5. | ఇండోనేషియా | 29 | 30 | 36 | 95 |
| 7. | థాయ్ లాండ్ | 27 | 26 | 55 | 108 |
| 8. | ఉజ్బెకిస్తాన్ | 25 | 24 | 30 | 79 |
| 9. | ఫిలిప్పిన్స్ | 10 | 4 | 5 | 19 |
| 10. | హాంకాంగ్ | 8 | 15 | 24 | 47 |

## కేసీఆర్ ఫ్యామిలీ ఫామ్‌హౌస్‌కే..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



'రాబోయే తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయాలి. ప్రజల మీద ప్రేమతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు. కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలి. అధికారంలోకి రాగానే మొదట ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం..' అని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. శనివారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని చేవెళ్ల, పరిగి, తాండూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్ర నిర్వహించారు.

# రైతు బంధుపైనే గులాబీ ఆశలు

(మొదటిపేజీ తరువాయి)
తరహా కసరత్తు చేస్తున్నది. సుమారు రూ. 7,500 కోట్లు ఈ స్కీమ్ కోసం అవసరమైనందున ఎలక్షన్ కమిషన్ నుంచి సానుకూల స్పందన వచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసేలా నిధులను రాష్ట్ర ఆర్థిక శాఖ సిద్ధం చేసుకుంటున్నది.తొలి టర్మ్‌లో ఉనికిలో లేని రైతుబంధు స్కీమ్‌ను 2018 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జూన్‌లో ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఒక్కో ఎకరానికి రూ. 4 వేల చొప్పున రాష్ట్రంలోని సుమారు 64 లక్షల మంది రైతులకు వారికున్న భూ విస్తీర్ణానికి అనుగుణంగా నేరుగా వారి ఖాతాల్లోనే జమచేసేలా రైతుబంధు స్కీమ్‌కు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా ఓట్లు రాలుతాయని కేసీఆర్ భావించారు. అనుకున్నట్లుగానే 2018 ఎన్నికల్లో ఫస్ట్ టైమ్ కంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. ఈసారి కూడా అదే ఫార్ములాను బీఆర్ఎస్ అమలు చేయాలను కుంటున్నది. త్వరలోనే రైతుబంధు నిధుల విడుదలకు పర్మిషన్ ఇవ్వాల్సిందిగా ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయనున్నట్లు అధికార వర్గాల సమాచారం. రైతుబంధు కురిపించే ఓట్లను గమనంలోకి తీసుకొని ఈ సాయాన్ని దశలవారీగా పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చారు. తొలుత ఎకరానికి ఒక సీజన్‌కు రూ. 4 వేలు ఉన్నదాన్ని రూ. 5 వేలకు పెంచామని, కొత్త ప్రభుత్వం ఏర్పడగానే దీన్ని ఐదేండ్ల వ్యవధిలో దశలవారీగా రూ. 8 వేలకు పెంచుతామన్నారు. ఆ ప్రకారం ఈ సాయం సంవత్సరానికి రెండు సీజన్లకు కలిపి రూ. 16 వేలకు చేరనున్నది. రైతుబంధు ద్వారా ప్రభుత్వం నుంచి సహాయం అందుకుంటున్న రైతులు కృతజ్ఞతగా ఓట్లు వేస్తారన్నది కేసీఆర్ ఆలోచన. అందువల్లనే ఈసారి పోలింగ్ కంటే ముందే రైతుబంధు సాయం ఇస్తే దానికి ప్రతిఫలంగా ఓట్లు పొందవచ్చన్నది ప్లాన్.ఎన్నికలు వచ్చినప్పుడల్లా కొత్త స్కీమ్‌లను తెరపైకి తీసుకురావడం కేసీఆర్ పొలిటికల్ స్ట్రాటెజీ. గత అనుభవాలు కూడా దీన్నే ధృవీకరిస్తున్నాయి. హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా దళితబంధు స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. దళిత కుటుంబాలకు వన్ టైమ్ సాయంగా రూ. 10 లక్షలను ప్రకటించారు. అయినా హుజూరాబాద్‌లో చేదు అనుభవమే వచ్చింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా వరదల నష్టం పేరుతో తలా రూ. 10 వేల సాయాన్ని బాధితులకు నగదు రూపంలో ఇచ్చారు. ఇక్కడ కూడా ఆశించినంతటి స్థాయిలో సాలిడ్ మెజారిటీ రాలేదు. ఈసారి కాంగ్రెస్‌తో గట్టి పోటీ ఎదుర్కొంటున్నందున మరోసారి రైతుబంధు ద్వారా ఓటర్లకు రుచి చూపించే ప్రయత్నం జరుగుతున్నది.అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డబుల్ ఇండ్ల పంపిణీ, గృహలక్ష్మి పేరుతో సొంతింటి నిర్మాణానికి రూ. 3 లక్షల సాయం, చేతివృత్తులకు చేయూత పేరుతో బీసీలకు రూ. లక్ష సహాయం, మైనారిటీలకు ఇంతే మొత్తంలో పంపిణీ, విద్యార్థులకు స్కూళ్లలోనే బ్రేక్ ఫాస్ట్ అందించడం.. ఇలాంటివి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో ఏవీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అన్నీ మొక్కుబడి ప్రారంభోత్సవాలతోనే ఆగిపోయాయి. సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా మిగిలిందని చెప్పుకోడానికి, ఎన్నికల ప్రచారం సమయంలో ఆన్-గోయింగ్ స్కీమ్‌ల పేరుతో ముమ్మరంగా అమలు చేయడానికే వీటిని ప్రభుత్వం లాంచ్ చేసినట్లు కనిపిస్తున్నదిఎన్నికల సంఘం నుంచి ప్రత్యేక పర్మిషన్ తెచ్చుకుని రైతుబంధు సాయాన్ని అందించినా, అది ఏ మేరకు ఓట్లు రాలుస్తుందనే అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పర్మిషన్‌పై గులాబీ నేతల్లో అనుమానాలు ఉన్నప్పటికీ రైతులు కూడా ఈసారి భిన్నంగా స్పందిస్తున్నారు. పేదలకు ఉపయోగపడాల్సిన పంట పెట్టుబడి సాయం భూస్వాములకు కూడా ప్రభుత్వం అందించడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు.

వారి కోసమే కేసీఆర్ ఈ స్కీమ్ పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. పంట కొనుగోళ్లకు గిట్టుబాటు ధర అమలు చేస్తే రైతుబంధు కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని అభిప్రాయాలనూ వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా వ్యాఖ్యల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో రైతుబంధు ఓట్లను కురిపిస్తుందా లేదా అనే భయం అధికార పార్టీ అభ్యర్థులను వేధిస్తున్నది. సిక్స్ గ్యారెంటీస్ లో కాంగ్రెస్ ప్రకటించిన వరి పంటకు రూ. 500 బోనస్, గిట్టుబాటు ధర పెంపు, రైతుబంధు సాయాన్ని రూ. 15 వేలకు పెంచడం.. ఇవన్నీ రైతుల్ని పునరాలోచనలోకి నెట్టాయి.

## ముదిరాజ్ వర్గాలే టార్గెట్‌గా బీఆర్ఎస్ వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)
వీరిని ఏ మాత్రం తేలికగా తీసేసేందుకు ఏ రాజకీయ పార్టీలూ సిద్ధంగా ఉండవు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఈటల రాజేందర్ ఆ వర్గానికి ప్రతినిధిగా ఉన్నారు. ఆయను పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ వర్గం ఓట్లు దూరమ వకుండా ఉండేందుకు కేసీఆర్ చాలా ప్రయత్నాలు చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాష్ ను రాజీనామా చేయించి.. ఎమ్మెల్సీని చేశారు. ఆయనను మంత్రిని చేస్తారని అందరూ అనుకు న్నారు. కానీ మంత్రి వర్గంలో మార్పు చేర్పులు చేయకపోవడంతో చాన్స్ రాలేదు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో నీలం మధు ముదిరాజ్ అనే నేతను బీఆర్ఎస్ హైకమాండ్ ప్రోత్సహించింది. ఆయన బలంగా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అనుచరుల్ని ఏర్పాటు చేసుకున్నారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న మహిపాల్ రెడ్డి పై అసంతృప్తి ఉందని.. ఈ సారి బీసీలకు కేటాయి స్తారని అనుకున్నారు.

కానీ కేసీఆర్ ఆలోచించారో కానీ నీలం మధుకు టిక్కెట్ కేటాయించలేదు. నీలం మధు పట్టు విడవకుండా.. బుజ్జగింపులకు లొంగకుండా పోటీకి సిద్ధమయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా ముదిరాజ్ వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చారు. బహిరంగసభ నిర్వహించారు. ఇది బీఆర్ఎస్ నేతలకు ఇబ్బందికరంగా మారింది. వెంటనే ఆపరేషన్ ముదిరాజ్ ప్రారంభించారు. దిద్దుబాటు చర్యలకు బీఆర్ఎస్ శ్రీకారం చుట్టింది. తిరస్కరించలేని ఆఫర్లు ఇచ్చి ముదిరాజ్ వర్గంలో పేరున్న వారిని పార్టీలో చేర్చుకుంటోంది. రెండేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ రాజీనామా చేయించి ఉద్యోగ సంఘం నేత మామిళ్ల రాజేందర్ ను ముదిరాజ్ అన్న కారణంగానే పార్టీలో చేర్చుకున్నారు. తాజాగా బిత్తిరి సత్తి అలియాస్ రవికుమార్ ను కూడా పిలిచి ఆఫర్ ఇచ్చి కండువా కప్పుకోబోతున్నారు. ముదిరాజ్‌ల బహిరంగసభలో బిత్తిరి సత్తి ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆయనకే కండువా కప్పేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడంపై ఊగిసలాడుతున్న టీ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కూడా బీఆర్ఎస్ నుంచి బంపర్ ఆఫర్ వచ్చినట్లుగా చెబుతున్నారు. బీఆర్ఎస్‌పై ముదిరాజుల అసంతృప్తిని గుర్తించి నీలం మధును కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఆయనకు పటాన్ చెరు టిక్కెట్ ఆఫర్ చేసే అవకాశం ఉంది. ముదిరాజ్ సామాజిక తరగతి ఓట్లు గజ్వేల్‌లో 60 వేలు, సిద్ధిపేటలో 45 వేలు, సిరిసిల్లలో 40 వేలు, కామారెడ్డిలో 30 వేల దాకా ఉన్నాయి. ఇవి ఇప్పుడు కీలకంగా మారనున్నాయి. ఈ అంశాన్ని బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ముదిరాజ్‌ల ఓట్లతోపాటు గజ్వేల్‌లో బీజేపీ నుంచి పోటీ చేయబోతున్న ఈటల రాజేందర్ రూపంలో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు వ్యూహాలు పన్నుతోంది. పోటీగా ఆ వర్గం మొత్తాన్ని ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

## ఆరుగురు అభ్యర్థుల ఖరారు

(మొదటిపేజీ తరువాయి)
అధిష్టానం, సోనియా గాంధీ ఆశీస్సులతో చిన్నారెడ్డికి టికెట్ దక్కింది. చిట్టెం కుటుంబం నుండి మరొకరికి నారాయణపేట నియోజకవర్గ నుండి పోటీ చేసే అవకాశం లభించింది. మక్తల్ ఎమ్మెల్యే చిట్టె రామ్మోహన్ రెడ్డి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్వయనా సోదరుడు చిట్టేం వెంకటేశ్వర రెడ్డి కుమార్తె పర్ణిక రెడ్డి కి పోటి చేసే అవకాశం లభించింది. పర్ణిక రెడ్డి అప్పట్లో నారాయణ పేట ఎమ్మెల్యేగా ఉన్న ఆమె తాత చిట్టెం నర్సిరెడ్డి తండ్రి వెంకటేశ్వర రెడ్డి నక్సలైట్ల కాల్పుల్లో మృతిచెందిన విషయం తెలిసిందే. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుండి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి అనురుద్ రెడ్డి మధ్య టికెట్ కోసం మొదటి నుండి పోరు సాగుతూ వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులు పోటీకి గెలిచి వారి తరపున ప్రచారాలు నిర్వహించడం. రాహుల్ గాంధీ బట్టి విక్రమార్క పాదయాత్రలను జయప్రదం చేయడంలో ప్రధాన భూమికలు పోషించడం. కోమిటిరెడ్డి బ్రదర్స్ కు అత్యంత సన్నిహితుడు కావడంతో అనిరుధ్ కు టికెట్ లభించింది. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్కు టికెట్టు దొరకకపోవడంతో ఆయన అనుచర వర్గంలో నిరాశలు మునిగిపోయింది. నారాయ ణపేట నుండి అయినా పోటీ చేసే అవకాశాలు లభిస్తుందని ఆశించారు. కానీ ఆ అవకాశం కూడా దక్కలేదు. వనపర్తి నుండి టికెట్ ఆశించిన మేఘా రెడ్డి పేరే జాబితాలో ఉంటుందని అందరూ భావించారు.

సోనియా ఆశీస్సులతో ఆ అవకాశం మాజీ మంత్రి చిన్నారెడ్డికి దక్కింది. దేవరకద్ర నియోజకవర్గం నుండి డిసిసి అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి పేరు మొదటి జాబితాలోని రావాల్సి ఉంది. కారణాలు ఏవి అయినా రెండో జాబితాలో ఆయన పేరు వచ్చింది. శుక్రవారం ప్రకటించిన జాబితాలో ఆయన పేరు రావడంతో అభిమానులు ఉత్సాహం నెలకొంది. ఈ మధ్య భారతీయ జనతా పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డికి మహబూబ్నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసే అవకాశం దొరికింది. ఉమ్మడి పాల మూరు జిల్లా వ్యాప్తంగా మొదటి రెండవ జాబితాలను కలిసి మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు ప్రకటించింది. వీరిలో గద్వాల, మక్తల్, షాద్నగర్ నియోజకవర్గం బీసీలకు కేటాయించగా మిగిలిన వాటిలో అల్లంపూర్ అచ్చంపేట నియోజక వర్గం లో ఎస్సీలకు రిజర్వు కాగా మిగిలిన 10 స్థానాల్లో అగ్రవర్ణాలకే దక్కాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గద్వాల నుండి సరిత, నారాయణ పేట నుండి పర్ణిక కా రెడ్డికి టికెట్ కేటాయించడం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇద్దరు మహిళలకు పోటీ చేసే అవకాశాలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన పూర్తి కావడంతో అధికారం టిఆర్ఎస్ పార్టీకి ధీటుగా ప్రచారం చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది.

## యువతే గెలుపు ఓటములను శాసిస్తారు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



యువత.. దేశ నవ నిర్మాణంలో కీలక పాత్ర పోషించేది వీరే. వారి ఆలోచనలు అందరికంటే మిన్నగా, స్పష్టంగా, ఆవేశంగా ఉంటాయి. పాలకులను ప్రశ్నించాలన్నా? వారితో పనులు చేయించాలన్నా ముందుండి నడిపించేది వారే! నమ్మిన వారిని అందలం ఎక్కిస్తారు. నమ్మని వారిని అధ:పాతాళానికి పడేస్తారు. పాలకులను ఎన్నుకునే విషయంలోను వారి ఆలోచనా ధోరణి ఇతరులతో పోలిస్తే ఎప్పుడూ ప్రత్యేకమే. అలాంటి ఓటర్లు తెలంగాణలో లక్షల్లో ఉన్నారు. వారు తొలిసారిగా ఓటు హక్కు నమోదు చేయించుకున్నారు. తాజా ఓటర్ల జాబితా మేరకు రాష్ట్రంలో 18-19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 8.11 లక్షల మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు మధ్య వీరిలో 66 శాతం మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. అంటే ఏకంగా 5.32 లక్షల మంది కొత్తగా నమోదు చేసుకోవడం గమనార్హం. గతంలో అర్హత ఉన్న ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చేది. మీ సేవా కేంద్రాలు, ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది.ఈ తంతంగం అంతా ఎందుకు అనుకుని చాలా మంది అర్హులు ఓటు నమోదు చేసుకునే వారు కాదు. దీనికి తోడు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు తక్కువగా ఉండేవి. ఎంతో మంది నిరక్షరాస్యులు ఓటు హక్కు పొంద లేకపోయారు. అయితే ఈసారి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఆలోచించింది. అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందే మార్గాలను ఓటర్ల దరికి చేర్చింది. ఇంటి వద్ద కూర్చుని సెల్‌ఫోన్లో దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండి, ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా సీ-విజిల్ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. అంతే కాకుండా ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సప్, యూట్యూబ్‌లలో విస్తృత ప్రచారం కల్పించింది. ఓటు హక్కు ఎలా పొందాలో సూచించే వెబ్‌సైట్లతోపాటు యూట్యూబ్‌లోనూ తెలుగులో వివరించే వీడియోలుగా అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకున్న యువతీ, యువకులు పెద్ద ఎత్తున ఓటర్లుగా మారారు.గత ఎన్నికల్లో తెలంగాణలో 15 నియోజకవర్గాల్లో తక్కువ ఓట్ల మెజారిటీతో అభ్యర్థుల భవిత తారుమారైంది. వీటిలో ఎక్కువగా 3 వేల నుంచి 5 వేల ఓట్ల తేడా ఉన్నవే. ఈ సారి యువత భారీగా ఓట్లు నమోదు చేసుకోవడంతో ఆసక్తి ఏర్పడింది. కొత్తగా ఓటు వచ్చిన యువత ఎటువైపు మొగ్గుచూపుతుందో అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. కొన్నిచోట్ల గెలుపోటములను యువ ఓటర్లే శాసించే స్థాయిలో ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లోని నియోజకవర్గాల్లో యువ ఓటర్లు పెద్ద ఎత్తున ఉన్నారు. దాంతో రాజకీయ పార్టీలు కొత్త ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. యువజన సంఘాలను ఏర్పాటు చేసి, యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మా కళాశాలలున్న ప్రాంతాల్లో ప్రచారం ప్రారంభించాయి.రాష్ట్రంలో యువ ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. జనవరి 5 నాటికి 18-19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 2,78,650 మంది ఉండగా అక్టోబర్ నాటికి ఆ సంఖ్య 8,11,640కి చేరింది. ఇందులో యువతులు 3,45,471 మంది ఉండగా యువకులు 4,66,067 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓట్లు 102 ఉన్నాయి.

## సోషల్ మీడియాపై కారు గురి

**వరంగల్ - ప్రభాత సూర్యుడు :** సోషల్ మీడియాను సమర్ధంగా వాడుకుని... ప్రచారం చేసుకోవడం వల్లే నరేంద్రమోడీ ప్రధాని స్థాయికి ఎదిగారంటారు ... ఇప్పుడు అదే రూటు ఫాలో అవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది... వాస్తవానికి 2014 ఎన్నికల తర్వాత సోషల్ మీడియాకు ప్రాధాన్యత పెరిగింది.. అందుకే హ్యాట్రిక్ విజయంపై దృష్టి పెట్టిన గులాబీ పార్టీ ముఖ్యనేతలు .. సోషల్ మీడియా వినియోగంపై పార్టీ శ్రేణులను అలెర్ట్ చేస్తూ... వారిని గైడ్ చేయడానికి ప్రతి నియోజక వర్గానికి వార్ రూమ్‌తో పాటు పర్యవేక్షణకు సెంట్రల్ వార్ రూమ్ ఏర్పాటు చేస్తోంది.. గత దశాబ్దంగా ఎన్నికల ప్రచార ట్రెండ్ లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి... ప్రజలను నేరుగా కలిసి ప్రచారం చేయడంతో పాటు ... సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగిపోయింది .. అందుకే ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ... ప్రసార, సోషల్ మీడియాలను విరివిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పార్టీ నేతలకు సూచిస్తున్నారు ... ఓటర్లను ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్రను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రచార వ్యూహం రూపొందించుకోవాలంటున్నారు . కేటీఆర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావు కూడా ఎన్నికల ప్రచారం, సమన్వయం తదితర అంశాలపై గులాబీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు .... అందులో భాగంగా ప్రతి నియోజక వర్గానికి వార్ రూమ్‌తో పాటు పర్యవేక్షణకు సెంట్రల్ వార్ రూమ్ ఏర్పాటు చేసింది బీఆర్ఎస్... ఈ వార్ రూమ్‌లలో 380 మందికి పైగా పాలుపంచుకుంటున్నారు... సెంట్రల్ వార్ రూమ్ ద్వారా అందే సూచనలు, ఆదేశాలను క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా నియోజకవర్గ ఇన్‌చార్జిలు చర్యలు తీసుకోనున్నారు. 2014 ఎన్నికల తర్వాత సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగింది .. మోడీ కూడా సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని ప్రధాని స్థాయికి ఎదిగారన్నది కాదనలేని వాస్తవం ... ఆ క్రమంలో వాట్సాప్‌తో పాటు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితరాలను ప్రచార వేదికలుగా ఉపయోగించుకోవాలని పార్టీ నేతలకు గులాబీ పెద్దలు సూచిస్తున్నారు.. విపక్ష పార్టీలు లేవనెత్తే అంశాలు, చేసే విమర్శలపై స్థానికంగా ఎప్పటికప్పుడు స్పందించాలని ఆదేశించారు. మేనిఫెస్టోపై విమర్శలను తిప్పికొట్టడంతో పాటు అందులోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామాల వారీగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని గైడ్ చేస్తున్నారు.. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేతలు కొత్తరకం ఎన్నికల ప్రచార విధానాలకు అలవాటు పడాల్సిన అవసరం ఉందని ... పార్టీ గుర్తును డీపీగా పెట్టుకోవడంతో పాటు చొక్కాలపై గుర్తును ధరించాలని సూచనలు చేస్తున్నారు ... అలాగే ప్రతి 100 మంది ఓటర్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జిలతో బూత్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు .. పోలింగ్ ముగిసేంత వరకు పార్టీ నేతలు, కేడర్ కష్ట పడాలంటున్న బీఆర్ఎస్ .. కాంగ్రెస్ వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ఎండగట్టాలని ఆదేశిస్తున్నారు ... అవసరమైన సందర్భాల్లో పార్టీ నేతలు బాధ్యతలు అప్పగించిన చోట నిద్రించాలని... ప్రతి గడపను చేరుకునేలా ప్రచారం జరగాలని చెప్పుకొస్తున్నారు .... మొత్తానికి అటు జనానికి చేరువయ్యే పనిలో ఉంటూనే ... సోషల్ మీడియాను కూడా సమర్ధంగా వాడుకోవడానికి స్కెచ్ గీసింది కారు పార్టీ.

## టార్గెట్ ఆ ముగ్గురు..!

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ ఎత్తులకు కాంగ్రెస్ పైఎత్తులు వేస్తోంది. బీఆర్ఎస్ కీలక నేతలు పోటీ చేసే చోట.. కాంగ్రెస్ కీలక నేతలను బరిలో నిలపాలని భావిస్తోంది. ఇటు పలువురు కాంగ్రెస్ కీలక నేతలు రెండు స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొడంగల్ తో పాటు కామారెడ్డిలో కూడా పోటీ చేయాలని భావిస్తున్నారు. కేసీఆర్ పై పోటీ చేయాలని రేవంత్ ను కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించినట్లుగా తెలుస్తోంది. అటు బీఆర్ఎస్ లో కీలకంగా ఉన్న హరీశ్ రావు, కేటీఆర్ పై కూడా ప్రధాన నేతలను పోటీలో ఉంచాలని కాంగ్రెస్ భావిస్తోందట. హరీశ్ రావు, కేటీఆర్ పై పోటీ చేసేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార్క సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజుర్ నగర్ తోపాటు సిరిసిల్లలో పోటీకి చేయడానికి సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. 50 మంది సొంత బందీల్ని చంపుకున్న ఇజ్రాయెల్ ? హమాస్ సంచలన ప్రకటన..! కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండతో పాటు సిద్దిపేటలో కూడా పోటీ చేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. త్వరలో కాంగ్రెస్ లో చేరనున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు తోపాటు అధిష్ఠానం ఆదేశిస్తే గజ్వేల్ లో బరిలోకి దిగుతానని స్పష్టం చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఈటల రాజేందర్ గజ్వేల్ కేసీఆర్ పై పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను కట్టడి చేసే ఆలోచనలో భాగంగానే కాంగ్రెస్ అధిష్టానం రెండుచోట్ల పోటీపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారానికి బయటికే వెళ్లకుండా కట్టడికి స్కెచ్ వేసినట్లు సమాచారం. ఏఐసీసీ వార్ రూమ్ డైరెక్షన్ లోనే రెండు సీట్లలో పోటీ చేయాలన్న నిర్ణయానికొచ్చినట్లు కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. ఈ విషయం ఫైనల్ అయ్యాకే సెకండ్ లిస్ట్ రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ రెండో జాబితాపై కసరత్తు కొనసాగిస్తోంది. . అటు బీజేపీ కూడా రెండో జాబితా పై కసరత్తు చేస్తోంది.

## తెలంగాణ ఎన్నికల బరిలో ఉంటాం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీటీడీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. బీజేపీతో పొత్తు నాదృష్టిలో లేదనీ, ఒంటరిగానే ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో చర్చించాకే ఎన్నిస్థానాల్లో పోటీచేయాలనేది నిర్ణయిస్తామని వివరించారు. శనివారం చంద్రబాబును పరామర్శించేందుకుగాను రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. ములాఖాత్‌లో భాగంగా ఆయన బాబును కలిశారు. తెలంగాణ రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితులు, పొత్తులు, ఇతర అంశాలపై బాబుతో చర్చించారు. పోటీ చేసేందుకు చంద్రబాబు సైతం అంగీకరించినట్టు కాసాని చెప్పారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి ? ఎక్కడెక్కడ చేయాలి ? తదితర అంశాలకు సంబంధించి లోకేశ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు, కాసానికి సూచించారు.

# ప్రచార వ్యూహాలతో కేసీఆర్

**మెదక్ - ప్రభాత సూర్యుడు :** సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన సీఎం కేసీఆర్.. రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు.. జాతీయ రాజకీయాల్లోనూ ఓ తిరుగులేని శక్తిగా ఎదిగారు. ఉద్యమమే ఊపిరిగా సుదీర్ఘ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆకాంక్షను సాధించిన కేసీఆర్ రాజకీయ ప్రస్థానం నల్లేరుపై బండి నడకలా సాగలేదు. ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో అవమానాలు ఎదుర్కొని.. వాటినన్నింటినీ దాటుకుని అంచ లంచలుగా ఎదుగుతూ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ యువజన్ కాంగ్రెస్ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు(కేసీఆర్).. ఆ తర్వాత.. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత.. కేసీఆర్ తొలి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. ఆ ఏడాదిలోనే మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే సమయంలో 16వ లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగానూ గెలిచారాయన. అయితే ఆ తర్వాత లోక్‌సభ పదవికి రాజీనామా చేసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీకి అధ్యక్షుడిగా, నాయకుడిగా కొనసాగుతోన్న సీఎం కేసీఆర్.. 2018 సెప్టెంబర్ 6న అసెంబ్లీని రద్దు చేసి.. ఆపై ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ముందుస్తు ఎన్నికల్లో విజయం సాధించి.. రెండోసారి తెలంగాణ రాష్ట్ర సీఎం పీటాన్ని అధిరోహించారు. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి సీఎం పీటంపై కేసీఆర్ కన్నేశారు. నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుండగా.. సీఎం కేసీఆర్ ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో



పర్యటించి.. తన రాజకీయ చాణక్యతను రంగరించి ఎన్నికల ప్రచార వ్యూహాలతో ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కూడా గులాబీ దళపతి ప్రజల సంక్షేమానికే పెద్ద పీట వేశారు. ఇక ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. అందులో ఒకటి ప్రస్తుత గజ్వేల్ నియోజకవర్గం కాగా, ఇంకొటి కామారెడ్డి నియోజకవర్గంఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ లిటరేచర్‌లో డిగ్రీ అందుకున్న తర్వాత.. 1980లో ఆంధ్రప్రదేశ్ యువజన్ కాంగ్రెస్ ద్వారా తన రాజకీయ అరంగేట్రం చేశారు సీఎం కేసీఆర్. ఆ తర్వాత రెండేళ్లకే సిద్ధిపేటలోని రాఘవపూర్ యువజన కాంగ్రెస్ స్థానిక ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అనంతరం 1983లో తెలుగుదేశం పార్టీలో చేరి.. 1985లో తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సిద్ధిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1987-88 మధ్యలో రాష్ట్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 1988-89 మధ్యలో కరువు నియంత్రణ మంత్రిత్వశాఖ మంత్రిగా సేవలు అందించారు. ఇక 1989లో మళ్లీ సిద్ధిపేట నియోజకవర్గం నుంచే తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1989 నుంచి 1993 వరకు టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 1993లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, 1994లో మళ్లీ సిద్ధిపేట నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు సీఎం కేసీఆర్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయంలో 1997 నుంచి 2000 దాకా రవాణ శాఖ మంత్రిగా పని చేసిన ఆయన.. 1999లో అసెంబ్లీకి ఎన్నికై, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రెండేళ్లు పని చేశారు. అనంతరం 2001లో తెలుగుదేశం పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి(ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీని స్థాపించారు. అంతేకాదు 2004లో క్యాబినెట్ హోదాలోనూ కార్మిక మంత్రిగా పని చేశారు కేసీఆర్.

# తెలంగాణ ప్రజలే మా జట్టు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తమకు ఏ పార్టీతో జట్టు లేదని, తెలంగాణ ప్రజలే తమ జట్టు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ పార్టీ సెంచరీ కొట్టడం ఖాయమని, ఈ ఎన్నికల్లో 100కుపైగా సీట్లతో కేసీఆర్ హాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలు కేవలం సర్వేల్లోనే గెలుస్తాయని, తాము ఎన్నికల్లో గెలుస్తామని అన్నారు. రాజకీయ కుట్రలో తాను పావును కాదని, ధైర్యంగా కొట్లాడే పటిమ తనకుందని తేల్చిచెప్పారు. బీజేపీ బీసీ సీఎం జపం ఎన్నికల గిమ్మిక్కేనని స్పష్టం చేశారు. శనివారం రోజున ఎక్స్ (ట్విట్టర్) వేదిక ద్వారా నిర్వహించిన “ఆస్క్ కవిత” కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు కల్వకుంట్ల కవిత సమాధానాలు ఇచ్చారు. రాజకీయ, వ్యక్తిగత అంశాలను పంచుకున్నారు. తెలంగాణ బీజేపీ నాయకత్వ బాధ్యతల నుంచి బీసీని తప్పించి అగ్రవర్ణాలకు అప్పగించారని, కేంద్రంలోని బీజేపీ బీసీల కులగణనను చేపట్టడానికి నిరాకరిస్తుందని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కోటా ఇవ్వకపోవడమే కాకుండా సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడాన్ని పట్టించుకోవడం లేదని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని విస్మరిస్తోందని వివరించారు. ఇవన్నింటికి పక్కనబెట్టి ఇప్పుడు తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, ఇది కేవలం ఎన్నికల గిమ్మిక్కుగా కవిత అభివర్ణించారు. తమకు రాజకీయ ప్రత్యర్థులతో ఎటువంటి డీల్ లేదని, తాము టీమ్ తెలంగాణ అని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీకి 100 కి పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఆలోచనాపరులని, పదేళ్ల ప్రగతిని గమనించారని వివరించారు. బాధ్యత ఉన్న ప్రభుత్వాన్ని, భరోసా ఇచ్చే నాయకుడిని ఆశీర్వదించి మళ్లీ ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత్ జోడో యాత్రపై స్పందిస్తూ%ా% “వంద ఎలుకలు తిన్న పిల్లి హజ్ యాత్రకు వెళ్లినట్లు” ఉందని ఎద్దేవా చేశారు. సర్వేల్లో కాంగ్రెస్ గెలుస్తుందన్న ప్రచారంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ%ా% 2018లో అదే ట్రిక్ ను



ప్రయోగించారని, అప్పుడు కూడా అనేక సర్వేల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న ప్రచారం చేశారని, కానీ బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు సర్వేల్లో మాత్రమే గెలుస్తాయని, కానీ తమ పార్టీ ఎన్నికల్లో గెలుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మెనిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టిందని ఆ పార్టీ చేస్తున్న ఆరోపణలకు ధీటుగా సమాధానమిచ్చారు. కాపీ కొట్టడానికి కూడా తెలివి ఉండాలని, కానీ కాంగ్రెస్ కు ఆ తెలివి కూడా లేదని విమర్శించారు. అలాగే, తెలంగాణతో ఆయన కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ%ా% “రాహుల్ గాంధీ ముత్తాత జవహార్ లాల్ నెహ్రూ తెలంగాణను ఆంధ్రతో కలపడం వల్ల 60 ఏళ్లు మోసపోయమని అన్నారు. 1969లో ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడుతున్న యువకులపై కాల్పులు జరిపి 369 మంది మరణించడానికి ఆయన నాయనమ్మ ఇందిరా గాంధీ కారణమయ్యారు. ఆయన తండ్రి రాజీవ్ గాంధీ తెలంగాణకు చెందిన ఉమ్మడి రాష్ట్ర సీఎం అంజయ్యను అవమానించి ఆ పదవి నుంచి తప్పించారు. సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో దిగొచ్చి తెలంగాణ ఏర్పాటు చేస్తామని 2009లో సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ప్రకటించి మళ్లీ వెనక్కి వెళ్లడం వల్ల వందలాది మంది ఆత్మహత్యలకు ఆయన తల్లి సోనియా గాంధీ కారణమయ్యారు. తెలంగాణ అంశాలపై పార్లమెంటులో రాహుల్ గాంధీ ఒక్క సారి కూడా మాట్లాడలేదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన డిమాండ్లపై మేము పోరాటం చేసినప్పుడు రాహుల్ గాంధీ మాట్లాడలేదు. నిజమే%ా% ఆయన కుటుంబానికి తెలంగాణతో అనుబంధం ఉంది. ఆ అనుబంధమే పదేపదే తెలంగాణ ప్రజలకు ద్రోహం చేయడం” అని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీలా కాకుండా ఎన్నికలు ఉన్నా లేకున్నా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిజమే మాట్లాడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణ ఎన్నికలు పూర్తయ్యే వరకే కపట ప్రేమను కనబర్చుతారని, ఎన్నికలు వచ్చినప్పుడే వచ్చి వెళుతుంటారని, తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర శూన్యమని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టం ఈ ఎన్నికల నుంచే అమలు చేయాలని తమ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారని, కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రం పోస్ట్ డేటెడ్ చెక్కులా ఆ చట్టాన్ని రూపొందించిందని మండిపడ్డారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రేక్షక పాత్రవహించిందని విమర్శించారు. ఢిల్లీ మద్యం కేసులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తనపై నిరాధార తప్పుడు ఆరోపణలు చేయడంపై తీవ్రంగా స్పందించారు.“రాజకీయ కుట్రలో పావును కాను. ధైర్యంగా కొట్లాడే పటిమ నాకు ఉంది” అని తేల్చిచెప్పారు. ఢిల్లీ మద్యం కేసుతో తన పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు. తనకు బలముంది కాబట్టే ప్రతిపక్షాలు తనపై విమర్శలను ఎక్కుపెడుతున్నాయన్నారు. చంద్రబాబు అరెస్టుపై నెటిజన్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ వయస్సులో చంద్రబాబు నాయుడు అరెస్టు కావడం దురదృష్టకరమని, ఆయన కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న బాధను తాను అర్థంచేసుకోగలనని పేర్కొన్నారు. తనకు సీఎం కేసీఆర్ ఆదర్శమని తెలిపారు. మంత్రి కేటీఆర్ బాధ్యతాయుతమైన సోదరుడని, ఎన్నో మధురానుబంధాలు ఉన్నాయన్నారు. తన తండ్రి కాకుండా ఇతర రాజకీయ నాయకుల్లో తన అభిమాన నాయకురాలు తృణముల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అని చెప్పారు. సినిమాల్లో తన అభిమాన హీరో చిరంజీవి, అల్లు అర్జున్ అని వెల్లడించారు.

# ‘కరెంటు’పై కర్నాటక వెళ్లి చూసొద్దామా..?

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

‘యుద్ధం రెండు రకాలుగా ఉంటుంది.. మేం బలపడటం.. ప్రత్యర్థులను బలహీనపర్చటం ఇదే మా వ్యూహం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ‘మీ ప్రభుత్వం, పార్టీ బలంగా ఉందంటున్నారు.. సంక్షేమ, అభివృద్ధి పథకాలు బాగా అమలవుతున్నాయని అంటున్నారు అలాంటప్పుడు ప్రతిపక్షాల నుంచి నేతలను విపరీతంగా ఎందుకు చేర్చుకుంటున్నారు ? వలసలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు ?’ అని అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వ పాలనలోనూ, సంక్షేమ, అభివృద్ధి పథకాల విషయంలోనూ కాంగ్రెస్‌కు, తమ పార్టీకి నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని చెప్పారు. కర్నాటక రైతులు తమ కరెంటు కష్టాల గురించి ఇక్కడికొచ్చి చెప్పుకుంటున్న నేపథ్యంలో%ా% వారికి బీఆర్ఎస్ డబ్బులిచ్చి తీసుకొస్తోందంటూ కాంగ్రెస్ నేతలు కొట్టిపడేయటాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ‘ఇద్దరం కలిసి ఒకే



బస్సులో కర్నాటకకు పోదాం. అక్కడి జనం దగ్గరకు పోయి.. కరెంటు గురించి అడుగుదాం మీరు సిద్ధమా అని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. టీఎస్‌యూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 55 ఏండ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన ఆ పార్టీ రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యానంతరం వివిధ సందర్భాల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ తొక్కిపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయాల్లో వందలాది మంది యువకులను కాల్చి చంపిందని తెలిపారు. ‘2009లో జగన్ కొత్త పార్టీ పెట్టటంతో ఏపీలో కాంగ్రెస్‌కు దిక్కూ దివాణం లేకుండా పోయింది. అక్కడి నష్టాన్ని కనీసం ఇక్కడైనా పూడ్చుకుందామనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది తప్ప ఇక్కడి ప్రజల ఆకాంక్షల మేరకు కాదు%ా%’ అని ఆయన వ్యాఖ్యానించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పుర్రెలో ఎప్పుడైనా రైతుబంధు, దళిత బంధు లాంటి పథకాలు, అలాంటి ఆలోచనలు పుట్టాయా..? అని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. తాము తొమ్మిదన్నరేండ్ల కాలంలో చేసిన అభివృద్ధిని వివరించి, ఆ తర్వాతనే ఓట్లడుగుతున్నామని తెలిపారు. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఏ ముఖం పెట్టుకుని, ఏం చెప్పి జనం దగ్గర ఓట్లడుగుతాయని నిలదీశారు.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్ రెడ్డి రంగారెడ్డి పేరు ఖరారు కావడంతో అబ్దుల్లాపూర్ మెట్ మండల జడ్పీటిసి బింగి దేవదాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు లష్కర్ గూడ గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, శేఖర్, జంగమయ్య, ఐలయ్య, రమేష్, దర్శన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

– అబ్దుల్లాపూర్ మెట్, ప్రభాత సూర్యుడు



## మల్ రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ

యాచారం - ప్రభాత సూర్యుడు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డికి హార్దిక శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు గురునాథరెడ్డి, యాచారం మండల మాజీ ఎంపీపీ జ్యోతి శ్రీనివాస్ నాయక్, కొత్తపెలి ఎంపిటిసి గడల మాధవి మల్లేష్, పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### మళ్లీ కిషన్ రెడ్డి గెలవాలి

## కెసిఆర్ సర్కారే రావాలి

### బిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ ఉడుతల ప్రవీణ్ గౌడ్

యాచారం - ప్రభాత సూర్యుడు



యాచారం మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటా ప్రచారం చేయాలని బిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ ఉడుతల ప్రవీణ్ గౌడ్ కోరారు. గ్రామాలలో బిఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్టు, బీసీ బందు, ఇలాంటి పథకాలు కెసిఆర్ ప్రభుత్వంలోనే ప్రజలు లబ్ధి పొందారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో మంచి రెడ్డి కిషన్ రెడ్డి కృషి వల్లనే ఈ ప్రాంతంలో కంపెనీలు ఉద్యోగ అవకాశాలు ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం వస్తుందని అభివృద్ధి చెందుతుందని మళ్లీ కిషన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన అన్నారు.

## మావోయిస్టు లేఖ కలకలం

కొత్తగూడెం - ప్రభాత సూర్యుడు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో వెలిసిన మావోయిస్టు లేఖలు కలకలం రేపాయి. వాజేడు, వెంకటాపురం ఏరియా కమిటీ మావోయిస్టు కార్యదర్శి సుధాకర్ పేరుతో లేఖను విడుదల చేసారు. భూటకపు అసెంబ్లీ ఎన్నికల ను బహిష్కరించాలని, ఓట్ల కోసం వచ్చే బి.జే.పి .బి.ఆర్.ఎస్ పార్టీ లను తరిమి కొట్టండని లేఖలో మావోయిస్టులు పిలుపునిచ్చారు. హరిత హారం పేరుతో పోడు బూముల్లో మొక్కలు నాటి రైతుల భూములను లాక్కుంటున్నారని లేఖలో పేర్కొన్నారు. బి.జే.పి ప్రభుత్వం మోడీ నాయకత్వంలో బ్రాహ్మనియ ,హిందుత్వ మతోన్మాదం పేరుతో దళితులపై,మైనారిటీల పై దాడులు చేస్తున్నారని మావోయిస్టు ల లేఖలో పేర్కొన్నారు.

### ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లిన రాంపూర్ గ్రామం బీఆర్ఎస్. నాయకులు

నాగర్ కర్నూల్ ప్రభాత సూర్యుడు : అచ్చంపేట సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు రాంపూర్ గ్రామం బీఆర్ఎస్. నాయకులు తరలి వెళ్లారు. బీ ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల సుదీర్ గౌడ్ ఆధ్వర్యం లో 150 మంది బీ ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలూ అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రభుత్వా విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎమ్మెల్యే అభ్యర్థిగా అచ్చంపేట నియోజకవర్గం లో పోటీ చేస్తున్న సందర్భంగా సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్గ్రామఅధ్యక్షులు రఘుపతి, వెంకటేశ్,బలిశ్వరమ్మ, శ్రీనివాసులు, మల్లయ్య, జ్యోతి, రాజు, మసమ్మ బాలస్వామి, వసంత, తో పాటు 150 మంది పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్ కాంగ్రెస్ లో చేరిక

కరీంనగర్- ప్రభాత సూర్యుడు

కరీంనగర్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్ కాంగ్రెస్లో చేరనున్నారు. నేడు బీఆర్ఎస్కు రాజీనామా చేసిన ఆయన.. రేపు హైదరాబాద్లో కానీ, ఢీల్లీలో కానీ కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఎలాంటి పదవులు ఆశించకుండా కాంగ్రెస్లో చేరుతున్నట్లు సంతోష్ తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.

# 'పట్నం' అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటా

- టికెట్ రాలేదని కార్యకర్తలెవ్వరు నిరాశ పడొద్దు
-ఇంకా అవకాశం ఉంది.. బిఫామ్ తనకే దక్కుతుంది
-సర్వేలన్నీ తనకే అనుకూలంగా ఉన్నాయి
- టీపీసీసీ కార్యదర్శి దండెం రాం రెడ్డి

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బిఫామ్ తనకే దక్కుతుందని టీపీసీసీ కార్యదర్శి, ప్రచార నిర్వహణ కమిటీ సభ్యులు దండెం రాం రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం వెలువడిన కాంగ్రెస్ పార్టీ రెండో విడత జాబితాలో దండెం రాం రెడ్డి పేరు లేకపోవడంతో ఆయన అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం పెద్ద అంబర్ పేట్ లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండెం రాం రెడ్డి మాట్లాడుతూ.. టికెట్ రాలేదని కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు ఎవ్వరూ అసంతృప్తి పడవద్దని, పార్టీ కేవలం అభ్యర్థుల జాబితా మాత్రమే ప్రకటించిందని, బీఫాంలు కేటాయించేంత వరకు ఇంకా అవకాశం ఉందని అన్నారు. మొదటి నుండి సర్వేలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని, కచ్చితంగా ఇబ్రహీంపట్నం నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బిఫాం తనకే దక్కుతుందని ఆశాభావం చేశారు. గత 20 సంవత్స రాలుగా పార్టీకి విధేయునిగా పనిచేస్తూ అంచలం చెలుగా ఎదిగానని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా పార్టీ జెండా మోసి ప్రతి కార్యకర్తను కాపాడుకున్నానని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ టికెట్ అంశాన్ని అధిష్టానం పునః పరిశీలించాలని ఈ సందర్భంగా కోరారు. టికెట్ రాలేదని అధైర్యపడేది లేదని, కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని, టికెట్ వచ్చినా,రాకున్నా అభిమానుల, కార్యకర్తల అండదండలతో ఖచ్చితంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బరిలో ఉంటానని స్పష్టం చేశారు.



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న దండెం రాం రెడ్డి



అభిమానుల,కార్యకర్తలతో కలిసి అభివాదం తెలియజేస్తున్న రాం రెడ్డి

# బీజేపీని వీడనున్న మహిళానేతలు?

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంటే ఆయా రాజకీయ పార్టీల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ తామే నని గొప్పలు చెప్పుకున్న బిజెపికి ఊహించని విధంగా వరుస షాక్ లతో కుదేలు అవుతుంది. ముఖ్యంగా తెలంగాణలో బిజెపి పార్టీ కి ఊపును తెచ్చిన బండి సంజయ్ ని పార్టీ అధ్యక్షపదవి నుండి తప్పించడం మూలంగా ఎన్నికల సమయంలో బీజేపీ గ్రాఫ్ దారుణంగా పడిపోతుందని రాజకీయపరిశీలకులు బావిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుత పార్టీ అధ్యక్షుని వైఖరి మూలంగా కుడా పలువురు పార్టీ సీనియర్ నేతలు ఇప్పటికే పార్టీని వీడగా కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో బిజెపిలో చేరిన పలువురు నాయకులు తీవ్ర అసంతృప్తితో, మళ్లీ సొంత గూటికి చేరుకుంటున్న తీరు బిజెపిని ఆందోళనకు గురిచేస్తుంది. అసలే ప్రజా క్షేత్రంలో బీజేపీకి తగ్గిన పట్టు, ఆపై నేతల తీరు వెరసి బీజేపీ ఊహించని చావు దెబ్బ తింటుంది. బిజెపికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భారీ షాకిచ్చారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బాటలో బిజెపిలో అసంతృప్తితో ఉన్న కొందరు మహిళా నేతలు కూడా వెళ్లనున్నారన్నచర్చ సాగుతుంది. ఇప్పటికే గద్వాలలో బీజేపీ తరఫున పోటీ చేసేందుకు డికె అరుణ విముఖతతో ఉన్నట్లు ఆమె అనుచరులు తెలుపుతున్నారు. గద్వాలలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి బలం ఎక్కువగా ఉండడంతో, బిజెపి నుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు తక్కువ ఉన్నాయని ఆమె భావిస్తున్నట్లుగా సమాచారం. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి బిజెపిలో చేరిన మరో నాయకురాలు విజయశాంతి సైతం పార్టీ తీరుపై తీవ్ర విముఖత తో ఉన్నారు. పార్టీలో తనకు గుర్తింపునివ్వడం లేదని తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ త్వరలో కాంగ్రెస్ లోకి చేరేందుకు సిద్ధమవుతున్నట్లు వారి సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న క్రమంలో బిజెపికి నేతలు వరుస షాక్ లు ఇవ్వడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.

## చెక్ రిపబ్లిక్ లోని నాడ్ లాబెమ్ పట్టణంలో నోట్ల వర్షం

న్యూ డిల్లీ - ప్రభాత సూర్యుడు

చెక్ రిపబ్లిక్లోని నాడ్లాబెమ్ పట్టణంలో నోట్లవర్షం కురిసింది. చెక్ ఇన్ఫ్లుయెన్సర్, టీవీ హోస్ట్ కమిల్ బార్టోషేక్ హెలికాప్టర్ ద్వారా మిలియన్ డాలర్ల సొమ్మును ప్రజలపై కుమ్మరించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.కమిల్ ముందుగా ఓ పోటీ నిర్వహించి అందులో గెలిచిన వారికి భారీగా సొమ్మును బహుమతిగా అందించాలనుకున్నాడు. అయితే, అతడు పెట్టిన పోటీలో ఎవరూ గెలవ లేకపోయారు. దీంతో ఏం చేయాలా అని ఆలోచించాడు. ఇందుకోసం ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించాడు. పోటీదారులందరికీ ఆ డబ్బును పంచాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో ఆదివారం ఆరుగంటలకు ఆ డబ్బును పంచుతానని పోటీదారులకు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈ మేరకు ఆ సమయానికి రావాల్సిందిగా ఓ ప్రదేశాన్ని మెయిల్ద్వారా సమాచారం ఇచ్చాడు. ఇక అనుకున్న సమయానికి నిర్దేశించిన ప్రాంతానికి ఓ కంటైనర్లో ఒక మిలియన్ డాలర్లను నింపుకొని వెళ్లాడు. అతడు జారవిడిచిన మొత్తం డబ్బు విలువ భారతీయ కరెన్సీ ప్రకారం సుమారుగా రూ.8 కోట్లకు పైమాటే. ఇక ఆ డబ్బుకోసం అక్కడున్న వారు పోటీపడి మిరీ దాన్ని పోగు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను కమిల్.. ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.

## ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కు ఎదురుదెబ్బ

మేడ్చల్ - ప్రభాత సూర్యుడు : మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ ఎదురయింది. ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ శిరీష, ఆమె భర్త సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి గురువారం కెసిఆర్ సమక్షంలో ప్రగతిభవన్లో బి ఆర్ ఎస్ లో చేరుతున్నట్టు వెల్లడించారు. సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అనేవాడు నన్ను నమ్మించి తడి గుడ్డతో గొంతుకోచాడని కొడంగల్ లో రేవంత్ రెడ్డిని ఓడించే వరకు నిద్రపోనని నాకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి విభేదాలు లేవని కానీ రేవంత్ నమ్మించి మోసడం చేయడంలో ముందుంటాడని ఆయనని మల్కాజ్గిరి ఎంపీ చేస్తే నన్ను ఎడారిలో వదిలేసిన వదిలేసాడని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్ లో జాయిన్ అయిన తర్వాత ఉప్పల్ నియోజకవర్గంలోని నా కార్యకర్తలతో కొడంగల్లో రేవంత్కు వ్యతిరేకంగా ప్రచారం చేయబోతున్నానని ఆయన తెలిపారు .

## ఎమ్మెల్యే వివేకానందపై పిర్యాదు

కుత్బుల్లాపూర్ - పభాత సూర్యుడు

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానందపై సూరారం పోలీస్ స్టేషన్ లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ పిర్యాదు చేసారు. బుధవారం నాడు ఒక ఛానల్ కార్యాక్రమంలో అయనపై ఎమ్మెల్యే వివేకా చేయి చేసుకున్న విషయం తెలిసిందే. పిర్యాదు పై స్పందించిన సురారం పోలీసులుచ కేసు నమోదుకై మేడ్చల్ కోర్ట్ ను ఆశ్రయించారుర. కోర్ట్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు అంటున్నారు.

### ఎమ్మెల్సీ కూచుమల్ల

## బీఆర్ఎస్ కు రాజీనామా

నాగర్ కర్నూల్ ప్రభాత సూర్యుడు : కొల్లాపూర్ వేదికగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా పత్రాన్ని ఫాక్స్ ద్వారా అందజేశారు. ఈ నెల 31న కొల్లాపూర్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అదేరోజు ఎమ్మెల్సీ పదవికి కూడా కూడా రాజీనామా చేస్తానని తెలిపారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో పది సార్లు ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ కోరిన ఇవ్వలేదని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డిఅరోపించారు.

## పోటీకి, పార్టీకి దూరం బాబు మోహన్




హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు : ఈ ఎన్నికల్లో నేను పోటీ చేయదల్చుకోలేదు, నేను ఎన్నికలకు, పార్టీ కి దూరంగా ఉండబోతున్నాను. పాత అధ్యక్షుడు... కొత్త అధ్యక్షులు.. ఇద్దరు నా ఫోన్ ఎత్తడం లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ అన్నారు. శనివారం అయన మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ శాసనసభ నియోజకవర్గం బీజేపీ టికెట్ వేరే వాళ్లకు ఇస్తారంటూ ప్రచారంజరుగుతోంది. ఈ 2023 నవంబర్ ఎన్నికల్లో పోటీ చేయొద్దని నిర్ణయించుకున్నా. ఎన్నికలకు, పార్టీకి, పార్టీ ప్రచారాలకు దూరంగా ఉంటాను. పార్టీ అయినా నా కొడుకు అడిగితే ఇవ్వొచ్చు కానీ బీజేపీ పార్టీ లిస్ట్ ల పేరుతో దాపరికం నచ్చలేదని అయన అన్నారు. అధిష్టానం నిర్ణయాన్ని బట్టి పార్టీ కి కూడా రాజీనామా చేస్తా. సోషల్ మీడియా వచ్చాక.. ఇపుడు నాకు టికెట్ రాదు అని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నా కొడుకు కు టికెట్ ఇస్తున్నారు అంటూ ప్రచారాలు వచ్చాయి. నాకు నా కొడుకు ను విడదీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అనవసరమైన ఊహ గానాలు చేస్తున్నారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఆత్మభిమానాని దెబ్బతీస్తే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని అయన అన్నారు. బీజేపీ పెద్దలకు ఒకటే చెప్తున్నా మీరు అర్హులు అయినా వారికే టికెట్ ఇచ్చుకోండి. నాకు అవమానాలు చాలా జరిగాయి. ఇప్పటికైన నా మీద మీడియాలో తప్పుడు ప్రచారాలను ఆపండి. నా ఆత్మభిమానఎం దెబ్బ తినడం వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నా. బీజేపీ ఫస్ట్ లిస్ట్ లో నా పేరు ప్రకటించకపోవడం వల్లే నా పై తప్పుడు ప్రచారాలు మొదలయ్యాయి. అందుకే ఈ నిర్ణయం అని అన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి నా ఫోన్ లిఫ్ట్ చేయరు. నన్ను కావాలనే దూరం పెట్టారని అయన విమర్శించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215